క్లుప్తంగా

అన్నిదానాల కన్నా విద్యాదానం గొప్పది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

చుంచుపల్లి: అన్ని దానాల కన్నా విద్యాదానం మహా గొప్పదని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం కొత్తగూడెంలోని కిడ్స్ పార్క్ టాలెంట్ స్కూల్ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కొత్తగూడెం ప్రాంతంలో 14 ఏళ్లుగా ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన రామిశెట్టి వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బండి లక్ష్మణ్, కాపు సీతాలక్ష్మి, కల్యాణి దుర్గ, రామిశెట్టి వెంకటేశ్వరరావు, అల్లి శంకర్, ఆర్.శ్రీనివాసరావు, కొల్లు నాగేశ్వరరావు, ఆనంద్ కుమార్, మోహన్‌రావు పాల్గొన్నారు.

చిట్టడివి, పార్క్‌లను సందర్శించిన ఎమ్మెల్యే

ఇల్లెందు: పట్టణంలోని కొత్త కాలనీ చిట్టడివి, పార్క్‌లను ఎమ్మెల్యే కోరం కనకయ్య సందర్శించి పరిశీలించారు. గురువారం మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే కోరం కనకయ్య చిట్టడివి, పార్క్‌లను పరిశీలించి ట్రాక్‌లో వాకింగ్ చేశారు. అనంతరం ఆ పక్కనే గల క్రికెట్ గ్రౌండ్‌ను పరిశీలించారు. ప్రత్యేక నిధులతో చిట్టడివిని, పార్క్‌లను అభివృద్ధి చేయాలని, వాకింగ్ చేసుకునేలా ట్రాక్‌లను ఏర్పాటు చేయాలని కోరారు.

'లక్కినేని'కి సన్మానం



సత్యనారాయణను సన్మానిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం బార్ కౌన్సిల్‌కు ఐదోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన లక్కినేని సత్యనారాయణను గురువారం కొత్తగూడెం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొదుమూరి శ్రీనివాసరావు, కంభంపాటి రవి, సత్యనారాయణ అగర్వాల్ పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఇల్లెందురూరల్: అర్హులైన ప్రతీఒక్కరు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరుతూ మండలంలోని పలు విభాగాల అధికారులు గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని పేర్కొన్నారు. ఓటును అమ్ముకోవద్దని, ప్రలోభాలకు గురికావొద్దని సూచించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులను అణచివేయాలి

పాల్వంచ: అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. గురువారం సాయంత్రం ఆయన స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి, ఉద్యోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ... భూకబ్జాదారులు, అక్రమార్కులు, వడ్డీ వ్యాపారులు, అక్రమ రవాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అవసరమైతే రౌడీషీట్ తెరవాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, అందరితో సామరస్యంగా పనిచేయాలని చెప్పారు.

ఆదివాసీలపై పోలీసు దాడులు సరికాదు..

సింగరేణి(కొత్తగూడెం): బుగ్గపాడు ఆదివాసీలపై పోలీసు దాడులను ఖండించాలని, ఆదివాసీలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమెక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి గొని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం బుగ్గపాడు బాధిత కుటుంబాలను న్యూడెమోక్రసీ బృందం పరామర్శించారు. మాట్లాడుతూ.. బుగ్గపాడు ఆదివాసీలపై జరిగిన దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సత్తుపల్లి మండలం బుగ్గపాడు చంద్రాయపాలెంలో జరిగిన ఘటనకు ఆటవీశాఖ అవలంబిస్తున్న ద్వంద్వ విధానాలేనన్నారు. బుగ్గపాడు ఆదివాసీ రైతులు తమ భూములను తామే సేద్యం చేసుకుంటామని అధికారులు అర్జీలు పెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. తక్షణమే ఈ ఘటనపై ప్రభుత్వం పరిశీలించి కమిటీ వేసి రైతులకు న్యాయం చేయాలని, ఆదివాసీ రైతులు, మహిళలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

బస్టాప్‌లు లేక జనం ఇక్కట్లు



చెట్టు కింద నిలబడి బస్సు కోసం ఎదురుచూస్తున్న మహిళలు

ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. ఉదయం తొమ్మిది గంటలకే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఇటువంటి పరిస్థితిలో బస్టాప్‌లు లేక ప్రయాణికులు బస్సుల కోసం మండుటెండల్లోనే ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీంతో మహిళా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా కనిపిస్తోంది. వీరిలో ఆలయాలను సందర్శించే వారే అధికంగా ఉంటున్నారు. కానీ అసౌకర్యాల కారణంగా మండలంలోని పుణ్యక్షేత్రాల సందర్శన స్థానిక భక్తులకు ఇబ్బందిగా మారింది.

- ఎండ సుర్రుమంటున్నా.. కనికరించరా..
- దుకాణాలు, చెట్టు నీడలోనే ప్రయాణికుల విశ్రాంతి
- కూడళ్లలో ఎవరికీ పట్టని అత్యవసర సౌకర్యాలు

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ కూడలి నుంచి ఖమ్మం, కొత్తగూడెం వైపుగా బస్సులు వెళుతుంటాయి. ప్రతీరోజు అత్యధిక సంఖ్యలో ప్రయాణికులు ఈ కూడలి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. కానీ ఇక్కడ మాత్రం ప్రయాణికులకు నిలువ నీడ కరువైంది. కనీసం బస్టాప్ సౌకర్యం కూడా మృగ్యమైంది. రోడ్డు వెడల్పు చేయక ముందు కూడలిలో ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్‌షెల్టర్ ఉండేది. రోడ్డు వెడల్పు జరిగిన తరువాత రహదారి ఇరుకుగా మారడంతో ఆర్టీసీ అధికారులు సైతం బస్టాప్ ఏర్పాటు ప్రయత్నం మానుకున్నారు. ఇక ఏడాది క్రితం ప్రభుత్వం సుభాష్‌నగర్ కూడలికి బస్‌షెల్టర్ మంజూరు చేసినప్పటికీ వాటిని కూడలికి దూరంగా ఏర్పాటు చేయడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో మండుటెండల్లో, వర్షం కురిసినప్పుడు ప్రయాణికులు సమీపంలోని దుకాణాల్లో తలదాచుకోవాల్సి వస్తోంది.

భక్తులకు కష్టాలు.

మేడారం సమ్మక్క–సారలమ్మ ఆలయం తరువాత రాష్ట్రంలోనే అంతటి పేరెన్నిక కలిగిన మండలంలోని బొజ్జాయిగూడెం సమ్మక్క–సారలమ్మ ఆలయం ఇల్లెందు–కొత్తగూడెం ప్రధాన రహదారి పక్కనే కొలువై ఉంది. ప్రస్తుతం ఇల్లెందుకు బస్‌డిపో కూడా మంజూరైంది. కానీ అంతటి ప్రాధాన్యత కలిగిన వనదేవతల ఆలయం వద్ద బస్టాప్ ఏర్పాటు చేయడంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రతీ ఆదివారం, గురువారం ఆలయానికి భక్తుల రద్దీ అధికంగా ఉంటుండగా, సాధారణ రోజుల్లో కూడా చెప్పుకోదగిన స్థాయిలో భక్తుల తాకిడి ఉంటుంది. బస్టాప్ ఏర్పాటు చేస్తే భక్తుల రాకపోకలు పెరిగే అవకాశం ఉంది. దీంతో భక్తులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

డిగ్రీ కళాశాలపై చిన్నచూపు...

ఇల్లెందు–కొత్తగూడెం ప్రధాన రహదారిలోనే ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉంది. ప్రతీరోజు వందల సంఖ్యలో విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో పలుమార్లు కళాశాల వద్ద బస్టాప్ ఏర్పాటు చేయాలని కళాశాల విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేసినా ఆర్టీసీ అధికారుల చెవికెక్కలేదనుకుంటా.. నేటికీ కళాశాల వద్ద బస్టాప్ ఏర్పాటుపై పట్టించుకోవడం లేదు.

మూత్రశాలలు లేవు...

నిత్యం వందల సంఖ్యలో జనం రాకపోకలు సాగించే సుభాష్‌నగర్ కూడలిలో సహజంగానే జనం రద్దీ అధికంగా ఉంటుంది. బస్సుల కోసం వేచి ఉండే సమయంలో, సుదూరం ప్రయాణం చేసి బస్సు దిగిన ప్రయాణికులకు అత్యవసరమైతే మూత్రశాలలు ఇక్కడ లేవు. పురుషులు సమీపంలోని ఖాళీ ప్రదేశాలకు పరుగులు తీస్తుంటారు. కానీ మహిళల పరిస్థితి మరీ దయనీయంగా ఉంటోంది. సమస్యను అధిగమించేందుకు ఏడాది క్రితం కేంద్ర ప్రభుత్వం పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినా వినియోగించుకోవడంలో పంచాయతీ పాలకవర్గం విఫలం అయింది. సకాలంలో నిర్మించుకోకపోవడంతో నిధులు వెనక్కు వెళ్లాయి. ప్రజలకు మాత్రం అవస్థలు పడుతున్నారు.

బస్టాప్‌ల కోసం విన్నవించాం...



బొజ్జాయిగూడెం సమ్మక్క–సారలమ్మ ఆలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద బస్టాప్ ఏర్పాటు చేయాలని గతంలో ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేశాం. మండల పరిషత్ తీర్మానం ద్వారా మరోసారి విన్నవిస్తా. త్వరలోనే మంజూరు చేసేలా కృషి చేస్తా.

– మెట్టెల శిరోమణి, ఎంపీటీసీ, బొజ్జాయిగూడెం

నిలువ నీడ కరువైంది..



ఇల్లెందు నుంచి కొత్తగూడెం, ఖమ్మం వెళ్లేందుకు సుభాష్‌నగర్ కూడలి ప్రధాన కేంద్రం. ఇక్కడ నిలువ నీడ లేకపోవడంతో మండుతున్న ఎండల్లో బస్సుల కోసం వేచి ఉండటం ఇబ్బందిగా ఉంది. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాప్ ఏర్పాటు చేయాలి.

– ఆళ్ల శిరీష, సుభాష్‌నగర్

క్రీడాకారిణికి ఎమ్మెల్యే అభినందన

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం మండలం చిట్టి రామవరానికి చెందిన జాతీయ స్థాయి క్రీడాకారిణి బానోతు పల్లవిని గురువారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఘనంగా సన్మానించారు. ఈ నెల 6 నుంచి బీహార్ రాష్ట్రం పాట్నాలో ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలో బానోతు పల్లవి పాల్గొననుంది, ఈ సందర్భంగా కొత్తగూడెంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... బానోతు పల్లవి ఆధైర్యపడవద్దని క్రీడల్లో పాల్గొని విజయం సాధించి కొత్తగూడెంకు, తెలంగాణకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ స్టెల్లా, పీఈటీ అరుణ క్రీడాకారిణి పల్లవికి అభినందనలను తెలిపారు. జాతీయ క్రీడాకారుడు ఎండీ బాబ్జి, కోచ్ డి.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

జూలూరుపాడు: అనంతారం గ్రామంలో శ్రీ అభయహస్త వీరాంజనేయస్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ ఆఫీస్ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి హాజరయ్యారు.

టెట్‌పై స్పష్టత ఇవ్వండి..



మాట్లాడుతున్న రవి

పాల్వంచ: ఉపాధ్యాయుల ప్రమోషన్లకు ఆటంకంగా మారిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌పై ప్రభుత్వం స్పష్టత నివ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి అన్నారు. స్థానిక పాత పాల్వంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం యూటీఎఫ్ సమావేశం నిర్వహించారు. రవి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు టెట్ రాయాల్సి ఉంటే ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు డిపార్ట్‌మెంటల్ పరీక్ష తరహాలో ప్రత్యేక టెట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని కోరారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపునకు, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా కార్యదర్శి మల్లెంపాటి వెంకటేశ్వర్లు, మండల బాధ్యులు ఎస్‌కే.యాకూబ్‌పాషా, నరసింహారావు, బి.శ్రీనివాసరావు, మోహన్‌రావు, బాలు, పద్మలత, కుమారి పాల్గొన్నారు.

మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా రమేష్



రమేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న పిడమర్తి రవి

పాల్వంచరూరల్: మండల పరిధి దంతలబోరు ఎస్సీ కాలనీకి చెందిన గద్దల రమేష్‌ను మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా మాదిగ జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిడమర్తి రవి నియమించారు. ఈ మేరకు గురువారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. మాదిగల సమస్యల సాధన కోసం పోరాటం చేస్తూ సంఘాన్ని బలోపేతం చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఇచ్చిన పదవీ బాధ్యతలను విస్మరించకుండా అందరికీ అందుబాటులో ఉంటానన్నారు.

నూతన విద్యావిధానాన్ని వ్యతిరేకిద్దాం..



మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో బీజేపీ అనుబంధ ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాద శక్తులపై ఆనాటి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం శేషగిరి భవన్‌లో ఏఐఎస్‌ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ విద్యను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పాలని చూస్తోందని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేసేందుకు విదేశీ విశ్వవిద్యాలయాలకు అనుమతి ఇచ్చిందని, స్వదేశంలో కూడా అదానీ, అంబానీ, టాటా లాంటి కార్పొరేట్ సంస్థలకు విశ్వవిద్యాలయాలు పెట్టుకునేందుకు వెసలుబాటు కల్పించిందన్నారు. ఈ విధానాలు ప్రభుత్వ విద్య, వ్యవస్థను ధ్వంసం చేసేందుకు తీసుకుంటున్న చర్యలని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యా వ్యతిరేక సంస్కరణ విధానాలకు వ్యతిరేకంగా చైతన్యం గల ఏఐఎస్‌ఎఫ్ నాయకత్వంలో విద్యార్థులు ఉద్యమించాలన్నారు. నేడు దేశంలో నూతన విద్యావిధానం పేరుతో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో ఆర్‌ఎస్సెస్ ఎజెండా అమలుకు బీజేపీ ప్రయత్నం చేస్తోందన్నారు. కేఎస్‌ఎం కళాశాలను అప్‌గ్రేడ్ చేసి జేఎన్టీయూ యూనివర్సిటీగా ఏర్పాటు చేయాలని, టెక్నికల్ కోర్సులు పెంచి జిల్లా పరిధిలోని విద్యార్థులకు అవకాశాలు కల్పించాలని కోరారు.

విఖ్యాత్ మృతికి సంతాపం

జూలూరుపాడు: వెంగన్నపాలెం గ్రామానికి చెందిన రిటైర్డ్ సీఐ చనుమోలు సుబ్బారావు – ఉపాధ్యాయురాలు ఉమామహేశ్వరి దంపతుల కుమారుడు విఖ్యాత్ (26) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. గురువారం భౌతికాయాన్ని పలువురు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో కొత్తగూడెం స్పెషల్ బ్రాంచ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగరాజు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీ మధుసూధన్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు యల్లంకి సత్యనారాయణ, బేబి దంపతులు, టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జర్నలిస్టు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షఫీ, విలేకరులు మోటమర్రి రామకృష్ణ, అఫ్జల్, శ్రీకాంత్, ఎస్.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

బిందెలతో రోడ్డెక్కిన మహిళలు



ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

ఇల్లెందురూరల్: తాము నివసిస్తున్న ప్రాంతానికి తక్షణమే తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ బిందెలతో గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఎంపీడీఓ ధన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నేత అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. సీఎస్సీ బస్తీ గ్రామ పంచాయతీ రాజీవ్‌నగర్ తండా సమీపంలోని ప్రభుత్వ ఖాళీ స్థలంలో ఐదేళ్ల క్రితం నుంచి పలువురు పేదలు గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని చెప్పారు. కనీస సౌకర్యాలు కల్పించాలని పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాల వద్ద ధర్నా చేసి వినతిపత్రాలు అందజేశామన్నారు. ప్రస్తుతం ఎండలు మండుతున్నా తాగునీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణం మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలేటి కిరణ్, మోహన్‌రావు, తాళ్లూరి కృష్ణ, వీరభద్రం, రాందాస్, వెంకన్న, హుస్సేన్, మల్లయ్య, సంతోష్, కౌసల్య, రజియా, విజయ, సుజాత పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాల స్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

జూలూరుపాడు: కాకర్ల శ్రీ రుక్మిణీ సహిత శ్రీసంతాన వేణుగోపాలస్వామి వారి ప్రథమ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ, శ్రీ కృష్ణసేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి బ్రహ్మోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. అందులో భాగంగా శ్రీ రుక్మిణీ సహిత శ్రీ సంతాన వేణుగోపాలస్వామి వార్ల కల్యాణం నిర్వహించారు. వేదపండితులు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పురోహితులు శాస్త్రోయుక్తంగా పూజలు నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి తహసీల్దార్ కె.స్వాతి బిందు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ, శ్రీ కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ వేడుకలు శుక్రవారంతో ముగియనున్నాయి.

సింగరేణి పూర్వవైభవానికి సహకరించండి



జీఎం శాలేంరాజును సన్మానిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో మూతపడిన భూగర్భగనిని ఓపెన్ కాస్ట్ చేసే క్రమంలో కావాల్సిన అనుమతులను త్వరగా తెప్పించి ఏరియాకు పూర్వవైభవం తేవాలని బీఎంఎస్ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు మొగిలిపాక రవి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజును కోరారు. గురువారం కొత్తగూడెం ఏరియాలో అత్యధిక ఉత్పత్తికి సహకరించిన ఏరియా జీఎం శాలేంరాజును కొత్తగూడెం ఏరియా బీఎంఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. రవి మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆల్‌టైమ్ రికార్డ్‌గా 70.02 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించటంలో ఏరియా జీఎంగా మీ పాత్ర కీలకమని, మీరు ఏరియాలో బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి కిందిస్థాయి, సెకండరీ స్థాయి అధికారులతో సమీక్షలు నిర్వహించి ఏరియాకు నిర్దేశించిన వార్షిక లక్ష్యం 129.50 లక్షల టన్నులను సుమారు 20 రోజుల ముందుగానే సాధించటం అభినందనీయమన్నారు. అదేవిధంగా మార్చి 31 వరకు 138.50 లక్షల టన్నులు 106 శాతం ఉత్పత్తిని సాధించి ఏరియాను సింగరేణి వ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచేందుకు మీరు ఎంతో కృషి చేశారన్నారు. ఉత్పత్తిలోనే కాకుండా రవాణాలో కూడా 3,114 రేకులు రవాణా చేసి సింగరేణి అధికారుల దృష్టిని ఏరియా వైపు మళ్లించే విధంగా తమ కృషి పట్టుదల హర్షణీయమని పేర్కొన్నారు. అనంతరం జీఎంకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ కాసర్ల మోహన్, రాజమౌళి, సత్యనారాయణ, రమేష్, స్వప్న, ప్రవీణ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి ఎదురు కావొద్దు



మాట్లాడుతున్న వైద్యాధికారిణి డాక్టర్ లోహిత

ఇల్లెందురూరల్: అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఎదురు కాకుండా రక్షణ చర్యలకు ఉపక్రమించాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చీమల నాగరత్నమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. అన్ని గ్రామాలలో సర్వే నిర్వహించి అవసరం ఉన్నచోట చేతి పంపుల మరమ్మతులు, నూతనంగా పైపులైన్లు ఏర్పాటు చేయడం వంటి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఇంకా ఎక్కడైనా సమస్య ఉంతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజాప్రతినిధులను కోరారు. మిషన్ భగీరథ డీఈ బాలాజీ మాట్లాడుతూ.. గ్రామాలలో మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా క్రమం తప్పకుండా చేపడుతున్నామని, ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మిషన్ భగీరథతోపాటు ప్రత్యామ్నాయ వనరుల అభివృద్ధికి కూడా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టేలా పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేస్తున్నామని వివరించారు. కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లోహిత మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండలు మండుతున్నాయని, ఈ సమయంలో అవసరం ఉంటే తప్ప ప్రజలు బయటకు రాకుండా చైతన్యం కలిగించాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలు, సత్వర చికిత్సపై విస్తతంగా ప్రచారం చేసి జాగ్రత్తలు సూచించాలని కోరారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

స్క్రాప్ అవినీతిపై విచారణ జరిపించండి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

పాల్వంచరూరల్: స్థానిక కొత్తగూడెం థర్మల్ (కేటీపీఎస్) పాతప్లాంట్ కూల్చివేయగా స్క్రాప్‌లో అవినీతి జరిగిందని, దర్యాప్తు చేయాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కేటీపీఎస్ పాతప్లాంట్ 8వ యూనిట్ కూల్చివేత టెండర్‌లో జరిగిన అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్, ఏసీబీ విచారణకు ఆదేశించాలని కోరారు. హెచ్‌ఆర్ కమర్షియల్ ముంబై కంపెనీ రూ.485 కోట్లకు టెండర్ వేసింది. వాస్తవానికి స్క్రాప్ విలువ రూ.850 కోట్ల నుంచి రూ.900కోట్లు ఉంటుందన్నారు. అప్పటి సీఎండీ, జెన్‌కో డైరెక్టర్లు కుమ్మక్కై తక్కువకు కట్టబెట్టారని ఆరోపించారు. గతంలో కూడా అనేక స్క్రాప్ మాయమైంది అని హెచ్‌ఆర్ కంపెనీ పోలీసులకు ఫిర్యాదు కూడా చేసింది. స్క్రాప్‌ను తరలించే వాహనాలు రాత్రి సమయంలో మాత్రమే ఎందుకు వెళ్తున్నాయని ప్రశ్నించారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, పానిశెట్టి వెంకటేశ్వర్లు, రాపాక రమేష్, గంధం ప్రసాద్, రంజిత్ పాల్గొన్నారు.

కొత్తగూడెంఅర్బన్: పాల్వంచ కేటీపీఎస్‌లోని పాత ప్లాంట్ టెండర్ల, కూల్చివేత పనులపై సమగ్ర విచారణ జరిపించాలని, రూ.100 కోట్లకుపైగా జరిగిన భారీ కుంభకోణంలో అధికారుల పాత్రపై ఏసీబీ విచారణ జరిపించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన పోలింగ్ బూత్ అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీపీఎస్ పాత ప్లాంట్‌లో తుక్కు కోసం టెండర్ దక్కించుకున్న ముంబైకి చెందిన సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ప్లాంట్ తొలగింపు పనుల్లో రూ.100కోట్లకు పైగా భారీ కుంభకోణానికి పాల్పడిందని ఆరోపించారు. తరలింపు సమయంలో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించకుండా, డిపార్ట్‌మెంట్ సెక్యూరిటీని కాదని ప్రైవేట్ సెక్యూరిటీని ఏర్పాటు చేసుకొని తరలింపు జరపడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రభుత్వం తూతూ మంత్రంగా తుక్కు రవాణా బంద్ చేసి చేతులు దులుపుకోవడం కాకుండా సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చిన్నారులకు ఏ లోటూ రానివ్వొద్దు..

సాక్షి ఎఫెక్ట్..



అంగన్‌వాడీ టీచర్‌తో మాట్లాడుతున్న విజేత

సుజాతనగర్: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారులతోపాటు, గర్భిణులు, బాలింతలకు ఏ లోటూ లేకుండా చూసుకోవాలని జిల్లా సంక్షేమాధికారిణి వేల్పుల విజేత అన్నారు. గొల్లగూడెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని చెట్టు కింద నిర్వహిస్తుండంతో 'చెట్టు కిందే అంగన్‌వాడీ సేవలు' అనే శీర్షికతో ఈ నెల 3న సాక్షిలో కథనం ప్రచురితం అయింది. స్పందించిన ఆమె గొల్లగూడెం గ్రామాన్ని గురువారం సందర్శించారు. చెట్టు కింద ఎందుకు సేవలు అందిస్తున్నారంటూ ఆరా తీశారు. గ్రామంలో సొంత భవనం లేకపోవడంతో కొన్నేళ్లుగా అద్దె భవనంలో నడిపిస్తున్న విషయాన్ని స్థానికులు ఆమెకు వివరించారు. ఈ క్రమంలో గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి తాత్కాలికంగా సెంటర్‌ను ఏర్పాటు చేయొచ్చా.. లేదా.. అంటూ ఉపాధ్యాయులు, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించిన ఆమె ఆ భవనం పిల్లలకు అనువుగా లేకపోవడంతో గ్రామంలో కలియతిరిగి మరికొన్ని ఇళ్లను పరిశీలించారు. పిల్లలకు అనువుగా ఉన్న ఓ ఇంటిని ఎంపిక చేసి సదరు ఇంటిలో అంగన్‌వాడీ సెంటర్‌ను నిర్వహించాలని ఆదేశించారు. సెంటర్ నిర్వహణకు అదనంగా మరో రూ.1000 కేటాయిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... చిన్నారుల్లో పోషకాహార లోపాలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. చిన్న వయస్సు నుంచే సరైన ఎదుగుదల ఉండేలా ప్రత్యేక చొరవ చూపాలని అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులకు సూచించారు. ప్రతి సంవత్సరం చిన్నారుల సంఖ్య పెరిగేలా కృషి చేయాలన్నారు. సమయానికి చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని, ఎప్పటికప్పుడు బరువు, ఎదుగుదలను పరిశీలించాలని చెప్పారు. పోషకాహార లోపం తలెత్తకుండా ఉండేందుకు చిన్నారులకు క్రమం తప్పకుండా కేంద్రాలకు పంపించాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను స్థానికులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ సలోమి, ఎంపీడీఓ టి.వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్లు జి.సుధతి, పి.రమాదేవి, పంచాయతీ కార్యదర్శి బి.నరేందర్, ఉమెన్ హబ్ కోఆర్డినేటర్ సంతోష, అంగన్‌వాడీ టీచర్ పద్మ పాల్గొన్నారు.